సాక్షి వరంగల్

శనివారం । 23 । నవంబర్ । 2024



రాజమండ్రిలో ఆక్సిజన్ సిలిండర్ కొనుగోలు!

రాయపర్తిలోని ఎస్‌బీఐలో చోరీ చేసిన దొంగలు రాజమండ్రిలో సిలిండర్ కొనుగోలు చేసినట్లు తెలిసింది. - 8లో▸



పగలు కూలీ.. రాత్రి దొంగ

పగలు కూలి పనులు చేస్తూ, రాత్రి చోరీలకు పాల్పడుతున్న దొంగను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28°/14°

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం చలిగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి స్పెషల్ గ్రీవెన్స్ రద్దు

వరంగల్: దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రతినెల నాలుగో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పెషల్ గ్రీవెన్స్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె కోరారు.

వీల్‌చైర్ క్రికెట్‌లో రాంజీ ప్రతిభ



వరంగల్ స్పోర్ట్స్: ఒడిశాలోని భద్రక్‌లో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి వీల్‌చైర్ క్రికెట్ ఉత్కల్ ట్రోఫీ టోర్నమెంట్‌లో వరంగల్‌కు చెందిన గుగులోత్ రాంజీనాయక్ ప్రతిభ కనబరిచాడు. తెలంగాణ దివ్యాంగ్ వీల్‌చైర్ క్రికెట్ టీం నుంచి జాతీయ స్థాయిలో పాల్గొన్న రాంజీనాయక్.. మూడు రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ జట్లతో తలపడి క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి చవిచూశాడు. తెలంగాణ జట్టు నుంచి పాల్గొన్న రాంజీనాయక్‌ను పలువురు అభినందించారు.

భద్రకాళి చెరువు మట్టి విక్రయం

వరంగల్ అర్బన్: భద్రకాళి చెరువులో పూడికతీత మట్టిని ప్రభుత్వ ధర ప్రకారం విక్రయిస్తున్నట్లు ఇరిగేషన్ ఈఈ బి.సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక ఘనపు మీటరుకు రూ.144 చెల్లించి మట్టి కావాల్సిన వాళ్లు కొనుగోలు చేయాలని కోరారు. ఇతర వివరాల కోసం హనుమకొండ నక్కలగుట్ట బల్దియా ఇంజనీరింగ్ కార్యాలయంలో ఈనెల 30లోగా సంప్రదించాలని, ఇతర వివరాల కోసం 90001 72854 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

గురుకులం ఆకస్మిక తనిఖీ



న్యూశాయంపేట: హనుమకొండలోని కేయూ క్రాస్ రోడ్డులో ఉన్న వరంగల్ (జీ–1) బాలికల గురుకులాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి టి.రమేశ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలోని కిచెన్‌లో నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను ప్రిన్సిపాల్ కృష్ణకుమారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయపాల్‌రెడ్డి, డీటీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



సుమన్ (ఫైల్)

నెక్కొండ: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గొల్లపల్లి శివారు మూడు తండాలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్యా కమలమ్మ–చందు పెద్ద కుమారుడు సుమన్ (21) ఇటీవల ఐటీఐ పూర్తి చేశాడు. పెళ్లికి సంబంధించిన విషయంలో తల్లిదండ్రులతో జరిగిన గొడవతో సుమన్ మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఈ నెల 21న రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్యాన్‌కు వేలాడుతున్న కుమారుడిని చూసిన తల్లిదండ్రులు కాపాడేందుకు ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కేయూలో విజిలెన్స్ అధికారుల విచారణ

కేయూ క్యాంపస్: కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ రమేశ్ హయాంలో వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా విజిలెన్స్‌మెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేశ్ బృందం శుక్రవారం యూనివర్సిటీలో విచారణ జరిపింది. వీసీ చాంబర్‌లో వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి సమక్షంలో విజిలెన్స్ అధికారులు పలు విషయాలపై సమాచారం తెలుసుకున్నారు. ప్రధానంగా 2021–22 పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన సమాచారాన్ని అడిగినట్లు తెలిసింది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవతకవలు జరిగాయనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన సీట్‌మ్యాట్రిక్స్ గురించి అడిగినట్లు సమాచారం. పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించి వివిధ విభాగాల డీన్‌లను కూడా వీసీ, రిజిస్ట్రార్లు వీసీ చాంబర్‌కు పిలిపించారు. అందుబాటులో ఉన్న డీన్‌లు కూడా వచ్చారు.

ములుగు జిల్లా వాజేడు మండలం బాలలక్ష్మీపురం (పెనుగోలు కాలనీ)లో రక్తపు మడుగులో ఉయికె అర్జున్ మృతదేహం, ఆస్పత్రిలో రమేశ్ మృతదేహం



ఏజెన్సీలో అలజడి

ఇన్‌ఫార్మర్ పేరిట ఉయికె రమేశ్, అర్జున్‌ల హత్యతో కలకలం

రెండేళ్ల తర్వాత మావోయిస్టుల మరో ఘాతుకం

- ఇన్‌ఫార్మర్లపై గురి.. ఉనికి చాటుకునేందుకు ప్రయత్నం
- ప్రజాప్రతినిధులు, టార్గెట్లను అలర్ట్ చేసిన పోలీసులు
- సరిహద్దులో కూంబింగ్ ముమ్మరం.. వాజేడు ఘటనపై డీజీపీ ఆరా?
- బతుకుదెరువు కోసం వస్తే హత్యలు చేస్తారా? మావోయిస్టులను ప్రశ్నించిన గిరిజనులు

సాక్షిప్రతినిధి, వరంగల్/వాజేడు/ఏటూరునాగారం :

జనావాసాలకు దూరంగా ప్రశాంతంగా ఉన్న ఆదివాసీ పల్లెలో అర్ధరాత్రి అలజడి రేగింది. ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు విసిరిన పంజాకు ఇద్దరు బలయ్యారు. గురువారం రాత్రి ములుగు జిల్లా వాజేడు మండలం బాలలక్ష్మీపురం (పెనుగోలు కాలనీ)లో ఉయికె రమేశ్, అర్జున్‌ను మావోయిస్టులు గొడ్డళ్లతో నరికి చంపడం సంచలనం సృష్టించింది. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందుకే ఖతం చేశామంటూ.. వాజేడు, వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట మావోయిస్టులు లేఖలు వదిలారు. అంతకుముందు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలను సైతం హెచ్చరించిన నక్సల్స్.. ఇద్దరిని ఇన్‌ఫార్మర్ల పేరిట హతమార్చడంతో పోలీసుశాఖ అలర్టయ్యింది. టార్గెట్లు, ప్రజాప్రతినిధులు అటవీ ప్రాంతాల్లో తిరగవద్దని అప్రమత్తం చేశారు. రోజూ ఏదో ఒక చోట పోలీసులు తని ఖీలు చేస్తున్నప్పటికీ మావోయిస్టులు పక్కా ప్రణాళిక ప్రకారం.. ఈరెండు హత్యలను చేసి ఉంటారని ఆదివాసీలు చెబుతున్నారు. ఉయికె రమేశ్ ప్రభుత్వ ఉద్యోగి. పేరూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. తనకు వరుసకు తమ్ముడు అయ్యే అర్జున్ పశువుల కాపరితోపాటు కూలి పనులకు వెళ్లేవాడు. నిత్యం తమతో ఉండేవారు తెల్లారేసరికి రక్తపు మడుగులో ఉండడం చూసిన ఆదివాసీలు భీతిల్లారు.

చంపారిలా..

గురువారం రాత్రి 11 గంటల సమయంలో అర్జున్ ఇంటికి ముగ్గురు మావోయిస్టులు వచ్చారు. అతడిని ఇంటి నుంచి బయటకు తీసుకొచ్చి గొడ్డళ్లతో నరికారు. అదే సమయంలో మరో ముగ్గురు మావోయిస్టులు గ్రామ కార్యదర్శి అయిన రమేశ్ ఇంటికి వెళ్లి అడ్డుగా కట్టిన గుడ్డను కత్తులతో కోసి లోపలికి చొరబడ్డారు. బెడ్‌పై పడుకున్న రమేశ్‌ను గొడ్డళ్లతో నరికారు. కొన ఊపిరితో ఉండగా.. స్థానికులు ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం చేస్తుండగానే చనిపోయాడు. రమేశ్‌కు భార్య రాంబాయి, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉండగా, అర్జున్‌కు భార్య సావిత్రి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాలను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భయాందోళనలో పెనుగోలు కాలనీ ఆదివాసీలు



కొత్తగూడ ఏజెన్సీలో తనిఖీలు చేస్తున్న ఎస్సై కుశకుమార్

గుట్టలపైనుంచి వచ్చి జీవనం..

పెనుగోలువాసులు గతంలో గుట్టలపై ఉండేవారు. అక్కడ ఏ పనీ లేకపోవడంతో అధికారుల సూచన మేరకు కిందికి దిగి వచ్చి పెనుగోలులో నివాసం ఉంటున్నారు. గుట్టలపై ఉన్నప్పుడు ప్రశాంతంగా జీవించామని, బతుకుదెరువు కోసం కిందికి దిగి వస్తే మావోయిస్టులు హత్యలు చేస్తారా? అని సూటిగా కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. అక్కడ బతకలేక అధికారుల ఒత్తిడితో గుట్టలు దిగి వస్తే తమను ఇక్కడ చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లేవని, అలాంటి తమను హత్య చేయడం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు.

ఏజెన్సీలో హై అలర్ట్..

మావోయిస్టులు ఎవరినైనా చంపాలంటే శీతాకాలంలోనే చేస్తారు. ఈ మేరకు వారి టార్గెట్లను పూర్తి చేస్తుంటారు. విపరీతమైన మంచు కురవడం, వారి కదలికలను కనిపెట్టే అవకాశం తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. ఇప్పటి వరకు జరిగిన ఇన్‌ఫార్మర్ హత్యలు నవంబర్, డిసెంబర్‌లోనే జరిగాయి. తాజాగా పెనుగోలు ఘటనే ఇందుకు నిదర్శనం. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె), తాడ్వాయి, మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గూడూరు, గంగారం, బయ్యారం తదితర ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం అందడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఎక్కడికక్కడే కూంబింగ్‌లు చేస్తూ అడవులను జల్లెడ పడుతున్నారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వివరాలను సేకరిస్తున్నారు. గొత్తికోయగూడేలను సైతం పోలీసులు తరచూ తనిఖీలు చేస్తూ వారి ఆధార్‌కార్డులు, ఫొటోలను సేకరిస్తున్నారు. ఈ ఘటనపై డీజీపీ జితేందర్ కూడా శుక్రవారం ఎస్పీ, ఏఎస్పీలను ఆరా తీసినట్లు తెలిసింది. యాక్షన్‌లో పాల్గొన్న మావోయిస్టులు ఎందరు? ఎలా జరిగింది? అన్న కోణంలో అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.



లేఖల్లో ఏం పేర్కొన్నారంటే..

ఇద్దరిని చంపిన స్థలంలో కార్యదర్శి శాంత, భారత కమ్యూనిస్టు పార్టీ పేరిట మావోయిస్టులు రెండు లేఖలను వదిలివెళ్లారు. ఆ లేఖల్లో.. 'ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన ఉయికె రమేశ్, ఉయికె అర్జున్ పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా పని చేస్తున్నారు. గుట్టలపై ఉన్నప్పుడు పార్టీ కదలికలను వారి అనుచరుల ద్వారా ఎప్పటికప్పుడు పసిగడుతూ పోలీసులకు సమాచారం ఇచ్చేవారు. క్రమంగా ఎస్ఐబీ కంట్రోల్‌కి వెళ్లి పనిచేస్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బార్డర్‌లో ఉన్న గ్రామాలైన లంకపెల్లి, జన్నపు, ఊట్ల, శ్యామల దొడ్డి, వాయిపేటలతోపాటు చుట్టు పక్కల గ్రా మాల్లో బంధువులు, స్నేహితుల ద్వారా సమాచారం సేకరించి పోలీసులకు చెప్పేవారు. మావోయిస్టులపై కొన్ని దాడులకు కారకులయ్యారు. ఆ తర్వాత ఉద్యోగం వచ్చి వాజేడు మండలంలో ఉంటున్నారు. చేపల వేట, పశువుల మేతకోసమని అడవిలోకి వచ్చి సమాచారం సేకరిస్తూ పోలీసులకు చేరవేస్తున్నారు. పెనుగోలు గ్రామస్తులు గుట్టపై ఉండొద్దని ఒత్తిడి చేసి దింపారు. పద్ధతులు మార్చుకోవాలని చెప్పినప్పటికీ వినలేదు. అందుకే రమేశ్, అర్జున్‌ను ఖతం చేస్తున్నాం.' అని పేర్కొన్నారు.

మా అన్న ఏ తప్పూ చేయలేదు..



నక్సల్స్ తప్పుడు సమాచారంతో మా అన్నను పొట్టన పెట్టుకున్నారు. ఎంతో కష్టపడితే 2019లో మా అన్నకు జాబ్ వచ్చింది. ఎలాంటి అవినీతి అక్రమాలు చేయకుండా నిజాయితీగా పనిచేస్తున్నాడు. ఎవరు ఏం చెప్పిండ్లో కానీ.. మా కుటుంబానికి తీరని అన్యాయం చేశారు. ఇలాంటి దుస్థితి ఎవరికీ రావొద్దు.

– శంకర్, రమేశ్ సోదరుడు

అలర్ట్.. అలర్ట్

- రెండేళ్ల తర్వాత సరిహద్దుల్లో మళ్లీ అలజడి..
- ఇన్‌ఫార్మర్ పేరిట హత్యలు..

అమాయకులను చంపారు..

- పౌర హక్కుల సంఘాలు స్పందించాలి
- ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్

మృతుల కుటుంబాలకు న్యాయం చేయండి

- మృతదేహాలతో ఆదివాసీ సంఘాలు, గిరిజనుల రాస్తారోకో, ధర్నా
- నెల రోజుల్లో న్యాయం చేస్తామని పోలీసుల హామీ - 8లో▸

అయ్యప్ప ఆలయంలో దివ్య పడిపూజ



ఆలయంలో దివ్య పడిపూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప ఆలయంలో అర్చకుడు దేవేశ్ మిశ్రా ఆధ్వర్యంలో స్వాములు శుక్రవారం దివ్య పడిపూజ నిర్వహించారు. అనిల్‌కుమార్–ఇందు, బాదం ప్రవీణ్‌కుమార్–లక్ష్మి, రంజిత్‌కుమార్–శ్రావణి, ఆగయ్య, అడ్డగట్ల చంద్రమౌళి–పద్మ అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా మాట్లాడుతూ మండల పూజ మహోత్సవంలో అన్నదాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శబరిమలకు వెళ్లే భక్తులు, స్వాముల కోసం నర్సంపేట ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫ సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, వరంగల్, హనుమకొండ, ములుగు రైస్ మిల్లర్స్ దేవునూరి అంజయ్య, ఇరుకు కోటేశ్వర్‌రావు, బండారి దామోదర్, బాదం ప్రవీణ్‌కుమార్, భూపతి లక్ష్మీనారాయణ, రాజశేఖర్, బండారుపల్లి చెంచారావు, శ్రీరాం కిరణ్, పాలకుర్తి శ్రీనివాస్, వజినపల్లి శ్రీను, అనంతుల ఆము, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, ప్రవీణ్, శ్రీరాముల కార్తీక్, భరత్ పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ రాంరెడ్డికి సన్మానం



జెడ్పీ సీఈఓ రాంరెడ్డిని సన్మానిస్తున్న పీఆర్ ఉద్యోగులు

వరంగల్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓఏ) జిల్లా యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నికైన జిల్లా పరిషత్ సీఈఓ జి.రాంరెడ్డిని శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని పీఆర్ ఉద్యోగులు కలి శారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ వసుమతి, సూపరింటెండెంట్లు ఉదయభాస్కర్, శ్రీదేవి, పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు యుగేందర్, విజయపాల్‌రెడ్డి, ఎంపీడీఓలు, జెడ్పీ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్. సంతోష్, వరంగల్ యూనిట్ అధ్యక్షుడు టి.వెంకట్‌రావు, చెన్నారావుపేట సమితి అధ్యక్షులు బి.వీరన్న, కుమార్, ప్రమీల, కార్తీక్, గౌస్‌పాషా పాల్గొన్నారు.

ఫీడర్లకు లైన్‌ఫాల్ట్ ఇండికేటర్లు



రేకంపల్లి సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

దుగ్గొండి: వ్యవసాయ పంపుసెట్లకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఫీడర్లకు లైన్‌ఫాల్ట్ ఇండికేటర్లు ఏర్పాటు చేస్తామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం, రేకంపల్లి సబ్‌స్టేషన్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సమస్యలు గుర్తించి పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మల్లంపల్లి గ్రామ విద్యుత్ ఫీడర్‌కు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన లైన్‌ఫాల్ట్ ఇండికేటర్‌ను పరిశీలించి మాట్లాడారు. విద్యుత్ పీడర్లకు లైన్‌ఫాల్ట్ ఇండికేటర్లు అమరిస్తే లైన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా తెలుస్తాయని తెలి పారు. దీంతో నిమిషాల వ్యవధిలో విద్యుత్ పునరుద్ధరించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన లైన్‌ఫాల్ట్ ఇండికేటర్ల పనితీరు బాగుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యుత్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిరంతరం నాణ్యమైన వి ద్యుత్ అందించాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. సీఎండీ వెంట సీఈలు అశోక్, కిషన్, రాజుచౌహాన్, జీఎం శ్రీనివాస్, ఎస్ఈ మధుసూదన్, డీఈ తిరుపతి, ఏడీ లక్ష్మణ్ ఏఈలు రామ్మూర్తి, ప్రత్యూష, లైన్ ఇన్‌స్పెక్టర్ అజీంపాషా, లైన్‌మెన్లు, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

దుగ్గొండి: ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు, జీపీఎఫ్ రుణాలు, పార్ట్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎంఏ.అజీజ్ ఉద్యోగ విరమణ సభ శుక్రవారం హెచ్‌ఎం రామస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజీజ్‌ను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. అనంతరం శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పిస్తామని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అజీజ్ తన సుదీర్ఘ ఉపాధ్యాయ జీవితంలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, నాయకులు అబ్దుల్‌గఫార్, తిరుపతిరెడ్డి, శ్రీహరి, పోలోజు భిక్షపతి, సుధాకర్ రెడ్డి, నక్కిరెడ్డి, మహేందర్, రాజేందర్, భాస్కర్, సురేందర్, ప్రతాప్‌సింగ్, యాకూబ్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు'

వరంగల్ అర్బన్: నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను మూడు నెలల్లో ప్రారంభమయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శుక్రవారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆయన ఇంజనీర్లతో సమావేశమయ్యారు. పట్టణ ప్రగతి, సీఎంఏ, జీఓ 65, జనరల్ ఫండ్ తదితర అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేసిన నేపథ్యంలో.. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆయా అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, పనుల్లో వేగం పెంచాలన్నారు. బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్లలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, ఆపనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలన్నారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈ శ్యాంమోహన్, ఏఈ సౌజన్య పాల్గొన్నారు.

26న 'ఇందిరా మహిళాశక్తి–ఉపాధి భరోసా'

- 2025 ఉపాధి హామీ క్యాలెండర్ రూపొందించాలి
- గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ఇందిరా మహిళాశక్తి–ఉపాధి భరోసా సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా ఈనెల 26న ఇందిరా మహిళాశక్తి–ఉపాధి భరోసా కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందిరా మహిళాశక్తి, ఉపాధి భరోసాలో భాగంగా 2025 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల క్యాలెండర్‌ను రూపొందించాలన్నారు. పంచాయతీరాజ్ నిధుల నుంచి, జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని చెప్పారు. నిధులు దుర్వినియోగం కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మండలాలు, గ్రామాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ఏ గ్రామానికి ఏమి అవసరమో గుర్తించి ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టాలని ఎంపీడీఓలు, ఏపీఓలకు సూచించారు. ప్రతి గ్రామం గంగదేవిపల్లిలా రూపుదిద్దుకునేలా ఉపాధి హామీ పనులు చేస్తే హైదరాబాద్ తర్వాత అభివృద్ధి చెందిన జిల్లాగా వరంగల్ గుర్తింపు పొందుతుందని కలెక్టర్ అన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, జిల్లా ప్రణాళిక అధికారి గోవిందరాజన్, ఎంపీడీఓలు, ఏపీఓలు, ఈసీలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందించాలి

మామునూరు ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు, గ్రీన్‌ఫీల్డ్ ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మామునూరు ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, గ్రీన్ ఫీల్డ్ ఇన్నర్ రింగ్ రోడ్డు పనులపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లాను సందర్శించిన అనంతరం వెలువడిన జీఓలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమీక్షలో ఇన్‌చార్జ్ డీఆర్వో, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, ఇక్బాల్, రాజ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, నేషనల్ హైవే అధికారి సల్మాన్‌రాజ్, జోనల్ మేనేజర్ రాములునాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళలు.. మౌనం వీడండి: సీపీ

వరంగల్ క్రైం: మహిళలు లైంగిక వేధిపులకు గురైతే మౌనం పాటించకుండా షీ టీంకు ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. తెలంగాణ మహిళా రక్షణ విభాగం రూపొందించిన వాల్‌పోస్టర్లను సీపీ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మహిళలు, బాలికల రక్షణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన వారిపై కూడా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారన్నారు. అపరిచిత వ్యక్తులపై మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని.. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైనా.. విద్యార్థినులు ర్యాగింగ్ పేరిట వేధింపులకు గురైనా మౌనంతో ఉండకుండా ధైర్యంగా షీ టీం బృందాన్ని సంప్రదించాలన్నారు. లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పరిపాలనా విభాగం అదనపు డీసీపీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, వరంగల్ షీ టీం ఇన్‌స్పెక్టర్ సుజాత, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రవాణా నిషేధం

- నార్కోటిక్స్ స్టేషన్ డీఎస్పీ సైదులు



హసన్‌పర్తి : డ్రగ్స్ కలిగి ఉండడం, వాటిని రవాణా చేయడం నిషేధమని నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ సైదులు అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని ఎస్సార్ యూనివర్సిటీలో నిషేధిత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సైదులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి వివరించారు. డ్రగ్స్, గంజాయి సేవించినా, రవాణా చేస్తున్నట్లు తెలిస్తే 1908, 87126 61711 సమాచారం అందించాలని ఆయన సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఎస్సై రవీందర్, ఎస్సార్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ భూపాల్‌రాజ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి



కేయూ క్యాంపస్ : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ టోర్నమెంట్ (పురుషుల)ను క్యాంపస్‌లోని క్రీడామైదానంలో ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. యూనివర్సిటీ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. తొలుత రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను వీసీ టాస్ వేసి ప్రారంభించారు. విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ, వాగ్దేవి ఫార్మసీ కాలేజీ క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్యులు వై.వెంకయ్య, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ అమరవాది శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ హరిందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీలు ఈనెల 23, 24 తేదీల్లోనూ కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వివిధ కళాశాలలకు చెందిన 11 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయి.

పార్సిల్ ఆఫీస్‌లో 'క్యూఆర్ కోడ్'

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లోని రైల్వే పార్సిల్ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ డివైజ్ సిస్టం ఇన్‌స్టాల్ చేసి ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. అధికారులు ప్రవేశపెట్టిన ఈ విధానంతో నగదు రహిత డిజిటల్ చెల్లింపులను సులభతరం చేయడానికి రైలు వినియోగదారుల వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు దోహదపడుతుంది. పార్సిల్ కస్టమర్లు క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి ఆన్‌లైన్‌లో పేమెంట్ ద్వారా రైల్వే పార్సిల్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్ పార్సిల్ కార్యాలయంలో కూడా క్యూ ఆర్ కోడ్ డివైజ్ సిస్టంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కాజీపేట రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్ల సముదాయంలో కూడా క్యూఆర్ కోడ్ డివైజ్‌ను మూడు నెలల క్రితం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్యూ ఆర్ కోడ్‌తో ఆన్‌లైన్‌లో టికెట్ చార్జీలు పేమెంట్ చేసి రైల్వే జనరల్, రిజర్వేషన్ టికెట్, ప్లాట్‌ఫాం టిక్కెట్ పొందవచ్చని అధికారులు తెలిపారు.

గ్రూప్-4 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్



నయీంనగర్ : టీజీపీఎస్సీ గ్రూప్-4 లో కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికైన ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను శుక్రవారం హంటర్‌రోడ్ సీటీఓ ఆఫీస్ కాంప్లెక్స్ సమీపంలోని వెంకటసాయి ఫంక్షన్ హాల్‌లో జాయింట్ కమిషనర్ సీహెచ్.హనమాండ్లు, డిప్యూటీ కమిషనర్లు మధుకర్‌రెడ్డి, వెంకటేశం పర్యవేక్షణలో కమర్షియల్ టాక్స్ సిబ్బంది పరిశీలించారు. మొత్తం 92 మంది అభ్యర్థులు ఎంపిక కాగా 86 మంది శుక్రవారం హాజరయ్యారు. మిగతా ఆరుగురు వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదన్నారు. తదుపరి రోజుల్లో వస్తామని గడువు కోరారని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో సీటీఓలు ఆసియా సుల్తానా, పుష్పలత, తిరుపతి రెడ్డి, భాస్కర్, మాలతి, వెంకటేశ్వర్లు, గోపి కిశోర్, సునీల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలర్ట్.. అలర్ట్..

రెండేళ్ల తర్వాత సరిహద్దులో మళ్లీ అలజడి.. | ఇన్‌ఫార్మర్ పేరిట గతంలోనూ హత్యలు..





పెనుగోలు కాలనీ పంచాయతీ

సాక్షిప్రతినిధి, వరంగల్/వాజేడు : మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు యత్నిస్తున్నారా? పోలీసుల కూంబింగ్ ఆపరేషన్లు, దాడులకు ప్రతిగా అధికార పార్టీ నేతలు, ఇన్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారా? నెల రోజులుగా మూడు రాష్ట్రాల సరిహద్దులో కార్యకలాపాలకు శ్రీకారం చుట్టిన వారు టార్గెట్లపై దాడులతో ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారా?.. అంటే అవుననే అంటున్నాయి పోలీసు, ఇంటెలిజెన్స్ వర్గాలు. ఆపరేషన్ ప్రహార్, కగార్.. వరుస ఎన్‌కౌంటర్లు.. పదుల సంఖ్యలో మరణాల నేపథ్యంలో దండకారణ్యంలో ఆ పార్టీ కేడర్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీంతో ఛత్తీస్‌గఢ్ నుంచి మకాం మార్చిన మావోయిస్టులు తెలంగాణలో పునర్వైభవం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసు, ఇంటెలిజెన్స్ వర్గాలు ముందే పసిగట్టాయి. ఇటీవల తెలంగాణ డీజీపీ జితేందర్ తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో పలువురు ఎస్పీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ అధికారులతో కీలక భేటీ నిర్వహించారు. ఇదే సమయంలో గురువారం రాత్రి ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు కాలనీ పంచాయతీ కార్యదర్శి ఉయికె రమేష్, ఉయికె అర్జున్‌లను మావోయిస్టులు దారుణ్యంగా హత్య చేశారు. ఏజెన్సీ ప్రాంతాలైన భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాలో ఘటనలు జరిగాయి. ఒక్క ములుగు జిల్లా వాజేడు మండలంలోనే ఇప్పటివరకు ఏడుగురిని ఇన్‌ఫార్మర్ల పేరుతో మావోయిస్టులు హత్య చేశారు.

గతంలో జరిగిన హత్యలు ఇలా..

- 2022 నవంబర్ 9న అర్ధరాత్రి వెంకటాపురం మండలం కొండాపురంలో వేణుగోపాల్ అనే వ్యక్తిని పోలీసు ఇన్‌ఫార్మర్ పేరిట హతమార్చడం అప్పట్లో సంచలనం రేపింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత రమేష్, అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ పేరిట హత్య చేయడం అటవీ పల్లెల్లో అలజడి రేపుతోంది
- 2021 డిసెంబర్ 21న రాత్రి వెంకటాపురం మండలం కె కొండాపురం మాజీ సర్పంచ్ కొరస రమేశ్ (26)ను ఇన్‌ఫార్మర్ పేరిట చంపారు.
- 2020 అక్టోబర్ 11న రాత్రి వెంకటాపురం మండలం బోదాపూర్ (అలుబాక)కు చెందిన బీఆర్ఎస్ నేత మాదూరి భీమేశ్వర్‌రావు (48)ను కూడా పోలీసులకు సమాచారం ఇస్తున్నాడంటూ ఆరోపిస్తూ దారుణంగా కత్తులతో పొడిచి చంపారు.
- 2009 ఆగస్టు 28న చిట్యాల మండలం వి.రామక్రిష్టాపురంలో ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మి భర్త లింగంపల్లి మోహన్‌రావును భూస్వాముల భూములు అమ్మించడంతోపాటు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని కాల్చి చంపారు.
- అక్టోబర్ 12న మహాముత్తారం మండలం ఎత్నారంలో ప్రజాప్రతిఘటన మాజీ దళకమాండర్ నూనావత్ రాంలాల్‌ను కాల్చి చంపారు.
- అదే సంవత్సరం అక్టోబర్ 19న తాడ్వాయి మండలం లింగాలలో సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ ఊకె సారయ్యను ఇన్‌ఫార్మర్ పేరిట కాల్చిచంపారు.
- కొత్తగూడ మండలం కోనాపురంలో కడారి నర్సింహారెడ్డి(45)ని నక్సల్స్ కాల్చి చంపారు.
- 2010 డిసెంబర్ 1న లొంగిపోయి టీడీపీలో చేరిన నక్సలైట్ కుమ్మరి సత్యంను హత్య చేశారు.
- 2012 మే 9న మహదేవ్‌పూర్ మండలం పంకెనలో మాజీ ఎంపీపీ చిన్నన్న, ఆయన సోదరుడు వెంకటస్వామిలపై కాల్పులు జరిపిన మావోయిస్టులు, ఆ తర్వాత అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత కమ్మల రాఘవులును కాల్చి చంపారు.

వాజేడు మండలంలోనే ఏడుగురు..

- 1983 ప్రాంతంలో మండల కేంద్రానికి చెందిన బుద్ధరాజు సీతాపతి రాజును తన ఇంటి వద్ద హత్య చేశారు.
- మొరుమూరు గ్రామానికి చెందిన బోదెబోయిన చందర్ రావును అదే గ్రామంలోని రహదారిపై కాల్చి చంపారు.
- పేరూరుకు చెందిన ఆలం రామకృష్ణయ్యను గ్రామ సమీపంలోని జామాయిల్ తోట వద్దకు తీసుకెళ్లి గొడ్డళ్లతో నరికి చంపారు.
- ధర్మవరం గ్రామానికి చెందిన బండారు శ్రీనివాసును ఇంటినుంచి బయటకు తీసుకువచ్చి రహదారిపై కాల్చి చంపారు.
- వాజేడుకు చెందిన దంతులూరి తిరుపతి రాజును తన పొలంలో నరికి చంపారు.
- తాజాగా ఉయికె అర్జున్, ఉయికె రమేష్‌లను గొడ్డళ్లతో నరికి చంపారు.

అమాయకులను చంపారు..

- పౌర హక్కుల సంఘాలు స్పందించాలి
- ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్



ములుగు: సీపీఐ మావోయిస్టులు ఇంకా కాలం చెల్లిన సిద్ధాంతాలతో కోల్పోయిన ఉనికిని చాటుకోవడానికి కొంతకాలంగా ఛత్తీస్‌గఢ్, ములుగు జిల్లా సరిహద్దు అయిన కర్రె గుట్ట అటవీ ప్రాంతాన్ని గెరిల్లా బేస్‌గా మార్చే ప్రయత్నంలో వరుస అఘాయిత్యాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. పెనుగోలుకు చెందిన అమాయకులను ఇన్‌ఫార్మర్ ముద్రవేసి దారుణంగా నరికి చంపారని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి ఉయికె రమేష్ మావోయిస్టు పార్టీకి సహకరించడం లేదని, అర్జున్‌ను పార్టీలో చేరాలని మావోయిస్టులు ఒత్తిడికి గురిచేయగా వారు నిరాకరించడంతోనే పాశవికంగా హత్య చేశారని పేర్కొన్నారు. స్వేచ్ఛగా జీవించే ఆదివాసీల నైతిక హక్కులను మావోయిస్టులు కాలరాస్తున్నారని తెలిపారు. ఈ వరుస సంఘటనలపై పౌర హక్కుల సంఘాలు స్పందించాల్సిన అవసరం ఉందని ఎస్పీ కోరారు. మావోయిస్టుల దుశ్చర్యను ఎట్టి పరిస్థితిల్లో ఉపేక్షించేది లేదని, ఆదివాసీల హక్కుల రక్షణకు మరింతగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయండి

- ఆదివాసీ సంఘాలు, గిరిజనులు, పంచాయతీ సిబ్బంది రాస్తారోకో, ధర్నా

వాజేడు : మావోయిస్టులు హత్య చేసిన ఉయికె రమేశ్, ఉయికె అర్జున్ కుటుంబాలకు న్యాయం చేయాలని శుక్రవారం వాజేడు మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాలు, గిరిజనులు, గ్రామ పంచాయతీ సిబ్బంది రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. మృతదేహాలను తీసుకు వచ్చిన అంబులెన్స్‌తో పెనుగోలు కాలనీకి వెళ్లే రోడ్డు వాజేడు, వెంకటాపురం(కె) రహదారిపై ధర్నాకు దిగారు. మృతదేహాలను ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. రమేశ్‌కు భార్య ముగ్గురు పిల్లలు, అర్జున్‌కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు, వెంకటాపురం(కె) ఎస్సైలు రుద్రారపు హరీష్, కొప్పుల తిరుపతిరావులు ఆందోళనకారులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. తమకు న్యాయం మాత్రమే కావాలని వారు పట్టుబడడంతో పోలీసులు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చివరకు సీఐ బండారి కుమార్ నెల రోజుల్లోగా రమేశ్ భార్యకు ఉద్యోగం వచ్చేలా చేస్తామని, అర్జున్ కుమార్తెల చదువుకు సాయం చేసి, పెద్ద కుమార్తె మేజర్ కాగానే ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

మృతదేహాలను సందర్శించిన అదనపు కలెక్టర్

మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేశ్, అర్జున్ మృతదేహాలను శుక్రవారం ఏటూరునాగారం ఏరియా వైద్యశాలలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సంపత్ రావు పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా రమేశ్ కుటుంబానికి త్వరలోనే సాయం అందిస్తామని తెలిపారు.



ధర్నా చేస్తున్న గ్రామస్తులు



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఐ

జల్సాల కోసం విద్యుత్ మోటార్ల చోరీ

- అంతర్‌జిల్లాకు చెందిన ఆరుగురి అరెస్ట్, 18 మోటార్ల స్వాధీనం
- డీఎస్పీ తిరుపతిరావు వివరాల వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

డోర్నకల్ : ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడుతున్న ఆరుగురు అంతర్‌జిల్లా దొంగలను డోర్నకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వివరాలు వెల్లడించారు. తొడేళ్లగూడెం సమీపంలో ఆటోలో విద్యుత్ మోటార్లు తరలిస్తున్న వ్యక్తులను తమ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించగా విద్యుత్ మోటార్లు చోరీ చేసినట్లు తెలిసిందన్నారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కొందరు గ్యాంగ్‌గా ఏర్పడి గత నాలుగు నెలలుగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్ల చోరీకి పాల్పడుతున్నట్లు చెప్పారు.ఇప్పటి వరకు 21 మోటార్లను చోరీ చేసి ఖమ్మం హనుమాన్ నగర్ కాలనీలో నివసిస్తున్న గ్యాంగ్ సభ్యుడు షేక్ మహ్మద్‌సాహెబ్ ఇంటి వద్ద 14 మోటార్లు దాచి, మరో మూడు మోటార్ల గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సా చేశారు. చోరీ చేసిన మరో నాలుగు మోటార్లను తొడేళ్లగూడెం శివారు కోతులవాగు సమీపంలోని పొదల్లో భద్రపరిచి శుక్రవారం విక్రయించేందుకు ఆటోలో తరలిస్తుండగా తమ సిబ్బంది పట్టుకున్నట్లు డీఎస్పీ తిరుపతి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం బస్వాపురం గ్రామానికి చెందిన కట్టా విజయ్, ఖమ్మం అర్బన్ మండలం అల్లీపురం గ్రామానికి చెందిన వేల్పుల వినేష్, బయ్యారం మండలం ఇర్సులాపురం గ్రామానికి చెందిన పగిడిపల్లి మహేష్, డోర్నకల్ మండలం తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన పిప్పళ్ల జగన్, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెనికి చెందిన అన్నారం ఉపేందర్, ఖమ్మం పట్టణానికి చెందిన గోకినపల్లి భరత్‌కుమార్ పట్టుబడ్డారు. ఖమ్మం జిల్లా బస్వాపురం గ్రామానికి చెందిన వట్టికూటి సాయికిరణ్, ఖమ్మంకు చెందిన షేక్ మహ్మద్‌సాహెబ్ పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి విద్యుత్ మోటార్లు, నంబర్ లేని ఆటోను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న డోర్నకల్ పోలీసులను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారని, సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డోర్నకల్ సీఐ బి.రాజేష్, ఎస్సైలు వంశీధర్, గడ్డం ఉమ పాల్గొన్నారు.

పగలు కూలీ.. రాత్రి దొంగ





వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- ఐదేళ్ల తర్వాత చిక్కిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి : పగలు కూలీచేస్తూ..రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. కేయూ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం నడిగడ్డ తండాకు చెందిన మాలోత్ హచ్యా అలియాస్ చిరంజీవి అలియాస్ రమేశ్ 15 ఏళ్ల క్రితం వడ్డెపల్లి ప్రాంతంలో అద్దెకు ఇల్లు తీసుకుని కూలీ పనితో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే కూలీతో వచ్చిన డబ్బులు కుటుంబం పోషణతో పాటు వ్యసనాలకు చాలక చోరీలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. కూలీ పనికి, ట్రాక్టర్ డ్రైవర్‌గా బయటికి వెళ్లినప్పుడు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి, రాత్రి వేళల్లో ఆయా ఇళ్లల్లో దొంగతనాలు చేసి జల్సా చేసే వాడని ఏసీపీ చెప్పారు.

11 కేసుల్లో నిందితుడు

మాలోత్ హచ్యా అలియాస్ చిరంజీవి 11 కేసుల్లో నిందితుడని, 2019-2024 వరకు వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. ఇందులో కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు, ఇంతేజార్‌గంజ్, మడికొండ, స్టేషన్ ఘనపురం పోలీస్ స్టేషన్ పరిధిల్లో దొంగతనాల కేసులు నమోదైనట్లు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో కూడా హచ్యాపై కేసులు ఉన్నట్లు చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తింపు

సాంకేతిక టెక్నాలజీ సాయంతో నిందితుడికి గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. దొంగలించిన ఆభరణాలను అమ్మకానికి వరంగల్ తీసుకెళ్తున్న క్రమంలో కాకతీయ యూనివర్సిటీ క్రాస్ వద్ద పోలీసులకు చిక్కినట్లు చెప్పారు. అతని వద్ద నుంచి 37 తులాల బంగారు, ఎనిమిది తులాల వెండి ఆభరణాలతో పాటు టీవీని స్వాధీనం చేసుకున్నారు.ఆభరణాల విలువ సుమారు రూ.25లక్షల వరకు ఉంటుందన్నారు. కేసును ఛేదించిన కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, ఏఎస్సై శివకుమార్, హెడ్ కానిస్టేబుళ్లు మున్నా, వేణుగోపాల్, కానిస్టేబుల్ సదానందం, క్రైం సిబ్బంది నర్సింగారావు, అహ్మద్ పాషా, రవి ప్రసాద్‌లను ఏసీపీ అభినందించారు.

రాజమండ్రిలో ఆక్సిజన్ సిలిండర్ కొనుగోలు

- ఆ చిరునామా వెతికే పనిలో ప్రత్యేక బృందం
- కర్ణాటక పోలీసుల సహకారంతో కేసు విచారణ
- కొలిక్కిరాని 'రాయపర్తి' బంగారం చోరీ కేసు

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఎస్‌బీఐలో 19 కిలోల బంగారం చోరీ కేసు పోలీసులను ముప్పుతిప్పలు పెడుతోంది. 497 మంది ఖాతాదారులకు సంబంధించిన సమస్య కావడంతో నాలుగు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి అన్ని కోణాల్లో విచారిస్తున్నా పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. ఇప్పటికే బంగారు ఆభరణాలు ఉన్న లాకర్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసే క్రమంలో గాయపడిన దొంగ ఎక్కడైనా చికిత్స తీసుకున్నాడా, మెడికల్ షాపుల్లో మందులు తీసుకున్నాడా అని పోలీసులు ఆరా తీసినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. బ్యాంకులో వదిలివెళ్లిన ఆక్సిజన్ గ్యాస్ సిలిండర్‌ను అమెజాన్ ద్వారా కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అది రాజమండ్రిలో ఉన్న చిరునామాకు డెలివరీ అయినట్లు తేలడంతో అక్కడికి ప్రత్యేక బృందం వెళ్లినట్లు తెలిసింది. ఇంకోవైపు కర్ణాటకలోని దావణగెరె జిల్లా న్యామతి పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ.12.95 కోట్ల విలువైన బంగారం కేసులో దర్యాప్తు చేస్తున్న పోలీసుల సాయం మరో ప్రత్యేక బృందం తీసుకుంటోంది. తొర్రూరు, ఖమ్మం మార్గాల్లోని సీసీటీవీ కెమెరాల్లో వాహనాల కదలికలను గుర్తించే పనిలో ఇంకో బృందం నిమగ్నమైంది. నాలుగు రోజులు కావొస్తున్నా బంగారం చోరీ కేసు కొలిక్కి రాకపోవడంతో బ్యాంకు అధికారులు, ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఖాతాదారులకు ఇబ్బంది లేదని, వారికి ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం బంగారం డబ్బులు చెల్లించేలా బ్యాంకు నియమ నిబంధనలు ఉన్నాయని అధికారులు భరోసానిస్తున్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ త్వరగా పూర్తిచేయాలి

- రైల్వే జేఏసీ కన్వీనర్ రాఘవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం రైల్వేశాఖ నిర్దేశించిన సమయానికి ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పూర్తి చేయాలని కాజీపేట రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అన్నారు. స్థానిక రైల్వే మిక్స్‌డ్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే జేఏసీ ఎలాంటి స్వార్థం లేకుండా నిరంతరం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, రైల్వే కార్మిక, రిటైర్డ్ సంఘాలు, అసోసియేషన్లు, వ్యాపార సంఘాలు, చిరువ్యాపారులు, తెలంగాణ పోరాట, మహిళా, యువజన సంఘాలను కలుపుకొని అలుపెరుగని పోరాటం చేస్తే 40 ఏళ్ల ప్రజల కల కోచ్ ఫ్యాక్టరీ సాధించుకోవడం జరిగిందని అన్నారు. సీతారామచంద్రస్వామి, శ్రీమెట్టు రామలింగేశ్వరస్వామి దేవతల అనుగ్రహంతో దేవాదాయ శాఖ భూములో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తున్న క్రమంలో ఈ నెల 24న మెట్టుగుట్టపై రుద్రాభిషేకం, హోమం, 27న వరంగల్ భద్రకాళి ఆలయంలో అమ్మవారికి చీర సారె అందించే కార్యక్రమం, 29న కాజీపేట గ్రీన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థన, డిసెంబర్ 1న కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం ఫాతిమాకేథడ్రల్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు మాట్లాడుతూ జేఏసీ చేపట్టే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు జి.సుధాకర్‌రావు, బి.మాధవరావు, ఎబ్నేజర్, లక్ష్మీనారాయణ, ఎ.శ్రీనివాస్, ఎం.మహేష్, పి.రమేష్, టి.ప్రవీణ్, జి.భాస్కర్, కె.సాయిరాజ్ పాల్గొన్నారు.

వేసవి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : వేసవి డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిల్, డివిజన్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని ఆయన సూచించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిలైనప్పుడు వారి రవాణాను డిపార్ట్‌మెంట్ వాహనంలోనే కచ్చితంగా తరలించాలన్నారు. వరికోతలు పూర్తవుతున్నందున వ్యవసాయ సర్వీసులు మంజూరు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతీ సర్కిల్‌లో రిపేర్ల షెడ్లను ఒక మోడల్ ఎస్పీఎం షెడ్డుగా తీర్చిద్దాలన్నారు. పోల్ నంబరింగ్ ప్రక్రియ, పోల్ మ్యాపింగ్ పనులు ఎంత వరకు జరిగాయని ఎస్ఈలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ లూజు లైన్లు వంగిన, తుప్పు పట్టిన స్తంభాలను, తక్కువ ఎత్తులో ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు పెంచాలని సూచించారు. అన్ని సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1912 ఉండాలని ఈ దిశగా విస్తృ ప్రచారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్‌లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, కిషన్, అశోక్, రాజు చౌహాన్, కె.ఎన్.గుట్ట, బీకం సింగ్, జీఎంలు పాల్గొన్నారు.

మార్కెట్‌లో స్వీపింగ్ మిషన్ డెమో



స్వీపింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు, వ్యాపారులు

వరంగల్: మిర్చి సీజన్‌లో యార్డులను క్లీనింగ్ చేసే పుణె కంపెనీకి చెందిన స్వీపింగ్ మిషన్ శుక్రవారం మార్కెట్‌కు వచ్చింది. మిషన్ డెమో ఇవ్వగా పనితీరును మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, చింతలపల్లి వీరారావు తదితరులు పరిశీలించారు. ఈ యంత్రం కొనుగోలు చేసేందుకు సుమారు రూ.1.20 కోట్లు కావాల్సి ఉంది. ప్రతీనెల నిర్వహణకు రూ.లక్ష వరకు వెచ్చించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయని ఉన్నతాధికారులు స్వీపింగ్ మిషన్‌కు ఇంతభారీ మొత్తంలో నిధులు ఇవ్వడం కష్టమేననే అభిప్రాయం వ్యాపారులు, అధికారుల్లో వ్యక్తమవుతోంది.